

గ్రామవాలంటీర్‌పై పోక్సో కేసు నమోదు
నిందితుని రిమాండ్‌కు తరలింపు



ప్రజాశక్తి - నాగలాపురం

మహిళలు, బాలికలపై అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ శివకుమార్‌రెడ్డి హెచ్చరించారు. నాగలాపురం పోలీసు స్టేషన్‌లో ఓ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ హనుమంతప్ప పోక్సో కేసు నమోదు చేశారు. సిఐ శివకుమార్‌రెడ్డి మాట్లాడుతూ నందనం గ్రామంలో వాలంటీర్‌గా పనిచేస్తున్న మధురెడ్డి అదే గ్రామానికి చెందిన ఓ బాలిక ఇంటికెళ్లి అమ్మఒడి పథకానికి ఆధార్‌కార్డు జిరాక్స్ కావాలని అడిగాడు. ఆ బాలిక ఇంటిలోపలికి వెళ్లి ఆధార్ జిరాక్స్ తెచ్చే సమయంలో వెనగ్గా వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో ఎస్ఐ హనుమంతప్ప ప్రాథమిక విచారణ జరిపారు. ఫిర్యాదు రుజువు కావడంతో నిందితుని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

'పురాతన' చిందేపల్లి రోడ్డుపై...

ల్యాంకో పెత్తనం..!



కేంద్రమంత్రి అండతో రెచ్చిపోతున్న వైనం
రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకున్నా గేటు ఏర్పాటు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

చిందేపల్లి లింక్ రోడ్డును మూసేస్తూ ల్యాంకో పరిశ్రమ(ఎలక్ట్రో క్యాస్టింగ్ లిమిటెడ్) యాజమాన్యం దౌర్జన్యంగా గేటు ఏర్పాటు చేయడం వెనక కేంద్ర పెద్దల హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకున్నా కేంద్ర పెద్దల అండ చూసుకుని ల్యాంకో యాజమాన్యం రెచ్చిపోతోందన్న విమర్శలూ లేకపోలేదు. వ్యాపారం కోసం ఊరు కాని ఊరొచ్చి..గ్రామస్తుల రోడ్డును ఇన్నాళ్లూ వాడుకునీ, అవసరం తీరాక ఆ రోడ్డునే కబలించేంత కండకావారం కేంద్ర పెద్దలిచ్చిందే కదా..! అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలో ఉన్న ఓ మంత్రి అండ చూసుకుని ల్యాంకో ఎండీ ఆ పరిశ్రమ పరిసర గ్రామాలపై దౌర్జన్యకాండకు దిగుతున్నారంటూ ప్రజలు బహిరంగగానే విమర్శలు చేస్తున్నారు. అక్రమంగా పోలీసులను వాడుకుని తమపై తిరుగుబాటు చేసే కార్మికుల నుంచి గ్రామస్తుల వరకూ అణచివేతకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు కోకొల్లలు.


అనధికారంగా గేటు ఏర్పాటు

స్వాతంత్ర్యం రాకమునుపు నుంచే చిందేపల్లి రోడ్డు వాడుకలో ఉంది. శ్రీకాళహస్తి -తిరుపతి రోడ్డు కోళ్ల ఫారం నుంచి చిందేపల్లి మీదుగా ఈ లింకు రోడ్డు వెంకటగిరి ప్రధాన మార్గంలో కలుస్తుంది. 2016 వరకు ఈ రోడ్డు గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. ఆ తదనంతరం 2016 ఏప్రిల్ లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక జీవో ప్రకారం ఆర్ అండ్ బీ రోడ్డుగా అవతరించింది. కోళ్లఫారం నుంచి ప్రారంభమయ్యే ఈ రోడ్డు చిందేపల్లి మీదుగా పది కిలోమీటర్లు వెంకటగిరి ప్రధాన మార్గంలో కలుస్తుంది. సుమారు 5 గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇదిలా ఉండగా 30 ఏళ్ల కిందట కోళ్ల ఫారం వద్ద ల్యాంకో కర్మాగారం పురుడు పోసుకుంది. ఆ దరిమిలా ఇన్నాళ్లపాటు ల్యాంకో కర్మాగారం చిందేపల్లి రోడ్డునే తమ ప్రధాన రోడ్డు మార్గంగా వినియోగించుకుంటూ వస్తోంది. అయితే చిందేపల్లి రోడ్డుకు ఎగువభాగాన ల్యాంకో మరో ప్లాంటును ఏర్పాటు చేసుకోవడంతో ఆ యాజమాన్యానికి చిందేపల్లి లింక్ రోడ్డుపై కన్ను పడింది. రోడ్డును తమ పరిశ్రమలో కలుపుకునేందుకు పలుదఫాలుగా దౌర్జన్యాలకు దిగింది. అయితే గ్రామస్తులు అడ్డుకోవడంతో రెండు పర్యాయాలు రెవెన్యూ, పోలీసుల సమక్షంలో పంచాయతీ చేసి చిందేపల్లి రోడ్డును ఉంచాలని తీర్మానం చేశారు. అయితే అప్పటినుంచి గత కొన్నేళ్లుగా ఫ్యాక్టరీకి, గ్రామస్తులకు మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా ఉన్నాయి. అయితే ఈ మధ్య ఆ పరిశ్రమకు కొత్త ఎమ్‌డి రావడం, ఓ మాజీ పోలీస్ అధికారి పీఆర్వో కావడంతో చిందేపల్లి రోడ్డును మూసి వేసేందుకు పన్నాగం వేశారు. పరిశ్రమ ఎమ్‌డికి కేంద్రంలోని ఓ మంత్రి కుమార్తెతో సాన్నిహిత్యం ఉండడంతో మరోసారి చిందేపల్లి రోడ్డును మూసేసి గేటును ఏర్పాటు చేయడంలో విజయవంతమయ్యారు.

ఆదేశాలు లేకనే పరిశ్రమకు పోలీసు రక్షణ

అనాదిగా వాడుకలో ఉన్న ఓ రోడ్డును మూసేసి తమ గేటును ఏర్పాటు చేయడంలో ల్యాంకో యజమాన్యానికి పోలీసులు రక్షణ కల్పించడంపై ఆరోపణలు వస్తున్నాయి. తమ రోడ్డును మూసేశారంటూ ఓ ప్రైవేటు పరిశ్రమ వద్ద గ్రామస్తులు ఆందోళనకు దిగితే వారికి మద్దతుగా నిలవాల్సిన రెవెన్యూ, పోలీసులు పరిశ్రమ యాజమాన్యానికి అండగా నిలవడం సైతం విమర్శలకు దారితీస్తుంది. అసలు ప్రైవేట్ పరిశ్రమకు రక్షణ కల్పించాలని అటు పోలీసు ఉన్నతాధికారి నుంచి గాని, ఇటు రెవెన్యూ అధికారి నుంచి గాని ఎలాంటి మౌఖిక ఆదేశాలు అందలేదని తెలుస్తోంది. ఈ విషయంపై ఆర్డిఓ రామారావును వివరణ కోరగా పరిశ్రమ వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేయాలంటూ తమాకెలాంటి ఆదేశాలు రాలేదని వివరణ ఇవ్వడం గమనార్హం. ఇదే విషయంపై ఓ పోలీస్ అధికారిని వివరణ కోరగా తమకు ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయంటూ నవ్వుతూ సమాధానం దాటవేయడం గమనార్హం.

మా రోడ్డును వదులుకోం : ఆనందరెడ్డి చిందేపల్లి



చిందేపల్లి రోడ్డు మా పూర్వీకుల నుంచి మాకు సంక్రమించింది. అనాదిగా ఈ రోడ్డునే ప్రధాన రహదారిగా వాడుకుంటూ వస్తున్నాం. పైగా దీన్ని ఆర్ అండ్ బి రోడ్డుగా మార్చి ప్రభుత్వం అభివద్ధి చేసింది. ఈ క్రమంలో మాకు మరో దారి ఏర్పాటు చేస్తామని ల్యాంకో పరిశ్రమ చెప్పడం విడ్డూరం. మా రోడ్డును సాధించుకునేంతవరకు పోరాటం ఆపేది లేదు.



ఫ్యాక్టరీ ఎదుట నిరసన (ఫైల్)

దౌర్జన్యకారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయండి

చిందేపల్లి లింక్ రోడ్డును అక్రమంగా మూసి వేయడమే కాకుండా, అడ్డుకున్న గ్రామస్తులను దౌర్జన్యంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడంలో కీలక పాత్ర పోషించిన ల్యాంకో యాజమాన్యంతో పాటు రెవెన్యూ, పోలీసు అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బాధిత గ్రామస్తులు సోమవారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. వారికి సిఐటియు, జనసేన, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మద్దతుగా నిలిచారు. సిఐటియు నాయకుడు పెనగడం గురవయ్య మాట్లాడుతూ ల్యాంకో యాజమాన్యం అక్రమంగా చిందేపల్లి లింక్ రోడ్డును మూసివేసిందని మండిపడ్డారు. గ్రామస్తులకు ముందస్తు సమాచారం లేకుండానే రోడ్డును మూసివేసి గేటును ఎలా ఏర్పాటు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనధికారికంగా రోడ్డును మూసివేసి గేటు ఏర్పాటు చేస్తున్న ల్యాంకో పరిశ్రమ వద్దకు పోలీసులు ఎలా వస్తారనీ, వచ్చినా బాధితులను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలంలో గేటు ఏర్పాటు చేయడం నేరమనీ, ఎదురు తిరిగిన గ్రామస్తులను దౌర్జన్యంగా అరెస్టు చేసి స్టేషన్లో పెట్టడం శిక్షార్హం అన్నారు. వెంటనే ఆర్డీవో చిందేపల్లి గ్రామస్తులపై దౌర్జన్యకాండకు దిగిన ల్యాంకో యాజమాన్యంతో పాటు రెవెన్యూ పోలీస్ అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్య పరిష్కరిస్తామని ఆర్డీవో రామారావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సిఐటియూ నాయకులు గంధం మణి, రంగయ్య, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి వినుత కోట, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు పుణ్యమూర్తి, చిందేపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన

'స్పందన' వినతులకు పరిష్కారం చూపాలి : కలెక్టర్

తిరుపతి టౌన్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత కాల వ్యవధి లోపల సమస్యల అర్జీలకు అర్థవంత పరిష్కారం చూపాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లో స్పందన అర్జీల సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. జేసీ డికె బాలాజీ, డిఆర్ఓ శ్రీనివాసరావు, ఎస్‌డిసిలు కోదండ రామిరెడ్డి, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల వ్యాపారులపై చర్యలు తప్పవు : కమిషనర్

ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యాపారాలు చేస్తే తోపుడుబండ్ల వ్యాపారులపై చర్యలు తప్పవని కమిషనర్ అనుపమ అంజలి హెచ్చరించారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీల స్వీకరణ కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాల్గొన్నారు. తోపుడుబండ్ల వల్ల తీర్థకట్టవీధిలో, బ్లిస్ హోటల్ ఎదుట పార్కింగ్‌కు ఇబ్బందిగా ఉందన్నారు. అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

అసెంబ్లీలో భౌతిక దాడులు రాక్షసత్వం : టిడిపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వైసిపి ఎంఎల్ఎలు టిడిపి ఎంఎల్ఎ బాల వీరాంజనేయస్వామిపై సీనియర్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చౌదరిపై భౌతిక దాడులకు దిగడం రాక్షసత్వమని టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ మండిపడ్డారు. ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో నరసింహయాదవ్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన వైసిపి ఎంఎల్ఎపై గవర్నర్, కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. దాడులను టిడిపి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎంఎల్ఎలపైనే దాడులు చేస్తుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటన్నారు. ఇప్పటికే పట్టభద్రుల ఎన్నికల్లో వైసిపికి ప్రజలు గుణపాఠం నేర్పారన్నారు. రాబోవు ఎన్నికల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపడం ఖాయమన్నారు.

అన్నమయ్య కీర్తనలతో ఆధ్యాత్మిక చైతన్యం

క్యాంపస్ : సమాజంలో విలువలు పునరుద్ధరించి, ఆధ్యాత్మిక చైతన్యం పెంచేందుకు అన్నమయ్య కీర్తనలు ఎంతో దోహదపడతాయని శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం ఆచార్యులు కొలకలూరి మధుజ్యోతి పేర్కొన్నారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 520వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న సాహితీ సదస్సులు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. అధ్యక్షత వహించిన ఆచార్య కొలకలూరి మధుజ్యోతి 'అన్నమయ్య-సామాజికత' అంశంపై ఉపన్యసించారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో అన్ని వృత్తులవారు సమానమేనని, రాజు-పేద తేడాలు ఉండకూడదని, అందరికీ శ్రీహరే అంతరాత్మ అని అన్నమయ్య తెలియజేశారని చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం విశ్రాంత ఉప కులపతి అనుమాండ్ల భూమయ్య, సప్తగిరి ఉప సంపాదకులు నొస్సం నరసింహాచార్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం సరికాదు


ప్రజాశక్తి -సత్యవేడు



సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి 'చలో విజయవాడ'కు బయల్దేరిన కార్మికులపై పోలీసులు ఉక్కుపాదం మోపడం సరికాదని సత్యవేడు సిఐటియు మండల కార్యదర్శి ఎం.రమేష్ మండిపడ్డారు. సోమవారం సత్యవేడులో గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఎం.రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని కార్మికులు చేపట్టారన్నారు. ఆదివారం బయల్దేరడానికి సిద్ధపడుతుండగాపోలీసులు నోటీసులు ఇచ్చి ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారన్నారు. శాంతియుతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి చలో విజయవాడ చేపడితే నిరంకుశ ధోరణితోపోలీసులతో అణచి వేయించడం సబబు కాదన్నారు. అంగన్‌వాడీలకు, మధ్యాహ్న భోజన కార్మికులకు సిఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కనీస వేతనం ఇవ్వాలన్నారు. జీవో నంబర్ ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు డి.అరుణాచలం, అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకురాలు నిర్మల, ఝాన్సీ, కాంతమ్మ, ఇంద్ర, అనురాధ, శాంతి పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిని ఆధునీకరించాలి : టిటిడి జేఈవో

తిరుపతి సిటీ : ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రిని ఆధునీకరించి మరింత అభివద్ధి చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీ ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రిని సోమవారం జేఈవో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో శల్య తంత్ర విభాగము, ద్రవ్య గుణ, రసశాస్త్ర సిద్ధాంత, పంచగవ్య చికిత్స పరిశోధనా కేంద్రం, చిన్నపిల్లల వార్డ్, లిచ్ థెరఫీ గది, కాయ చికిత్స వార్డు, పంచకర్మ వార్డు, సెంట్రల్ డ్రగ్ స్టోర్, డ్రెస్సింగ్ రూమ్, క్లీనికల్ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, రక్త పరీక్ష కేంద్రం, ఎక్సరే విభాగాలను పరిశీలించారు. తరువాత ఎస్వీ ఆయుర్వేద కళాశాలలోని తరగతి గదులు, మ్యూజియం, గ్రంథాలయం, ఇతర విభాగాలను పరిశీలించారు. ఆయుర్వేద వైద్య విద్యార్థినుల హాస్టల్ భవనంలోని గదులను, డైనింగ్ హాల్, కిచెన్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులకు అందిస్తున్న వసతి, భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. శిల్ప కళాశాల ప్రాంగణంలో ఎంపోరియంను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఈ నాగేశ్వరరావు, ఎఫ్ ఏ అండ్ సిఏఓ బాలాజీ, ఎస్ఈ వెంకటేశ్వర్లు , డిఈవో భాస్కర్ రెడ్డి, అదనపు ఆరోగ్యాధికారి డా. సునీల్, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీ కష్ణ, ఆయుర్వేద ఆసుపత్రి సూపరిండెంట్ డా. రేణు దీక్షిత్ పాల్గొన్నారు.



అసెంబ్లీలో తిరుపతి భూ సమస్యపై మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతిలో భూ రిజిస్ట్రేషన్లు ఆపొద్దు
అసెంబ్లీ దృష్టికి భూమనకరుణాకర్‌రెడ్డి
'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'తిరుపతిలో భూ రిజిస్ట్రేషన్లు ఆపొద్దు' అని తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. 'ఈ భూములన్నీ మావే' అనే శీర్షికతో 'ప్రజాశక్తి'లో నెలరోజుల క్రితం కథనం వెలువడింది. ఈ నేపథ్యంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమానికి రూపకల్పన జరిగింది. వెంటనే స్పందించిన స్థానిక ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాత్కాలికంగా రిజిస్ట్రేషన్లు చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారి ద్వారా సర్క్యులర్ పంపారు. ఈ మేరకు సోమవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ ఒక్కరు కాదు ఇద్దరు కాదు 60వేల మంది పైగా ఈ సమస్యతో బాధపడుతున్నారని, ఈ భూ రిజిస్ట్రేషన్లు 50-60 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని చాలా మంది పేదలు, మధ్యతరగతివారు నివసిస్తున్నారని, వారికి న్యాయం చేయాలని అభ్యర్థించారు. గతంలో చంద్రబాబు హయాంలో 781 తీసుకొచ్చారని, పోరాటం చేశామన్నారు. 2004 తరువాత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఆ జీవోపై వెనక్కి తగ్గారన్నారు. మళ్లీ తిరుపతి భూముల విషయం తెరపైకొచ్చిందన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పందించి న్యాయపరమైన చిక్కులను పరిష్కరించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

జీవన శైలిలో మార్పుతో మానసిక రుగ్మతలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సాంఘిక జీవన విధానం, జీవనశైలిలో వచ్చిన మార్పులతో పలు మానసిక రుగ్మతలు తలెత్తుతున్నాయని ప్రముఖ సైకాలజిస్ట్ ఎన్‌బి సుధాకర్‌రెడ్డి అన్నారు. దంపతుల మధ్య తలెత్తే సమస్యలు, కుటుంబ సలహాలకు కౌన్సిలింగ్‌తో స్వస్తి చెప్పవచ్చని రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం అన్నారు. రాస్ కుటుంబ సలహా కేంద్రం సబ్‌కమిటి సమావేశంలో వారు మార్గనిర్దేశం చేశారు. సర్దుబాటు సమస్యలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక వ్యవహారాలు దంపతుల మధ్య దూరం పెంచుతున్నాయన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు, రాస్ చైల్డ్ లైన్ సమన్వయ కర్త కె.నాగమణి, ప్రత్యేక విద్యాకేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నందిని, రాస్ కౌన్సిలర్లు సి.బాలాజీరెడ్డి, పి.కవిత, అంకంనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు పిచ్చుక గూళ్లు తయారీపై శిక్షణ

తిరుపతి సిటి : శ్రీ వెంకటేశ్వర జూపార్కు, రీజినల్ సైన్స్ సెంటర్ వారి సమీక్ష ఆధ్వర్యంలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. విద్యార్థులకు పిచ్చుకుల గూళ్లు, వాటర్ స్ప్రింక్లర్లు తయారీపై వర్కుషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యూరేటర్ సెల్వం, అసిస్టెంట్ క్యూరేటర్ పురుషోత్తం పాల్గొన్నారు.

'తల గాయాల నియంత్రణపై' ర్యాలీ

తిరుపతి సిటి : స్విమ్స్ న్యూరో సర్జరీ, ఫిజియోథెరపీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రపంచ తల గాయాల నియంత్రణ' కోసం అవగాహనా ర్యాలీని సోమవారం నిర్వహించారు. డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ, తిరుపతి ట్రాఫిక్ డిఎస్‌పి కాటమరాజు, ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మాధవి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. స్విమ్స్ నుంచి బాలాజీ కాలనీ వరకు ర్యాలీ సాగింది. చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. హెల్మెట్, సీటు బెల్టు వాడకపోవడం వల్ల చాలామంది అక్కడికక్కడే మృతిచెందుతున్నారన్నారు.

పేద రోగికి 'ఎ' నెగిటివ్ రక్తదానం చేయండి

తిరుపతి సిటి : పేద రోగికి ఎ నెగిటివ్ రక్తదానం చేయాలని పిఆర్ఓ ఓ ప్రకటనలో కోరారు. స్విమ్స్ సిటీ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న నిరుపేద రోగి లీలావతి(37)కి అత్యవసరంగా ఎ నెగిటివ్ గ్రూపు రక్తం అవసరమని పేర్కొన్నారు. వివరాలకు 08772287777 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అటవీ పరిరక్షణకు తీసుకున్న చర్యలేంటి : ఎంపి

తిరుపతి టౌన్ : పరిశోధన, అభివృద్ధి పథకంలో భాగంగా అటవీ పరిరక్షణ, అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించాలని తిరుపతి ఎంపి గురుమూర్తి కోరారు. ఈ విషయమై పార్లమెంట్ ప్రస్తావించగా కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి అశ్విన్‌కుమార్‌చౌబే సమాధానం ఇస్తూ గత మూడేళ్లుగా 22 పరిశోధన ప్రాజెక్టులను మంత్రిత్వ శాఖ మంజూరు చేసిందన్నారు. 2019-20లో 4.50 కోట్లు కేటాయించగా 4.49 కోట్లు విడుదలయ్యాయన్నారు. 2020-21లో 3 కోట్లు కాగా 2.58 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. 2021-22లో 5 కోట్లు కాగా 4.21 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2.50 కోట్లు కేటాయించగా 1.90 కోట్లు విడుదల చేశామన్నారు.

డిప్యుటేషన్‌పై ఢిల్లీ పంపండి..!

కమిషనర్ అనుపమ అంజలి దరఖాస్తు
పరిశీలనలో నెల్లూరు కమిషనర్ హరిత





ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'ఇటీవలే పెళ్లయ్యింది.. నా భర్త ఐఎఎస్ కావడంతో హర్యాణాలో పనిచేస్తున్నారు.. డిప్యుటేషన్‌పై ఢిల్లీలో పనిచేసేందుకు అనుమతి ఇవ్వండి' అంటూ తిరుపతి కమిషనర్ అనుపమ అంజలి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు కమిషనర్‌గా పనిచేస్తున్న హరిత ఇక్కడకు వస్తారని చర్చ నడుస్తోంది. ఈనెలాఖరులోపు, లేదంటే వచ్చే నెలలో ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

కమిషనర్ అనుపమ అంజలి తిరుపతిలో పనిచేస్తున్నారు. ఇటీవల వివాహమయ్యింది. ఇద్దరూ ఐఎఎస్‌లు కావడంతో తిరుపతిలోనే ఇద్దరికీ పోస్టింగ్ దొరకడం కొంత కష్టమే. కాబట్టి తనను డిప్యుటేషన్‌పై ఢిల్లీ పంపాలని ఆమె దరఖాస్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిఎంవో కార్యాలయం నుంచి కమిషనర్ డిప్యుటేషన్‌పై వెళ్లడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడే ఉండొచ్చని సూచించారు. అయితే పెళ్లయిన కారణంగా తాను ఉండలేనని, తనుకు డిప్యుటేషన్ అవకాశం ఇవ్వాలని కోరారు. తిరుపతి కమిషనర్‌గా అనుపమ అంజలి గత ఏడాది ఏప్రిల్‌లో బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యతలు చేపట్టి సరిగ్గా ఏడాదికి తనను ఢిల్లీకి బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దాదాపు మేయర్ శిరీషతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యారు. ఆరు మాస్టర్‌ప్లాన్‌రోడ్లు శరవేగంగా చేపట్టారు. వీటికితోడు స్మార్ట్‌సిటీలో జరుగుతున్న ఇండోర్ స్టేడియం పనులు, గల్లవానిగుంట స్టేడియం పనులు, వినాయకసాగర్ పనులు వేగంగా జరిపించేందుకు కమిషనర్ నిరంతరం సమీక్షలు చేస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. తిరుపతిలోని లబ్ధిదారులకు గృహ నిర్మాణ పనులు వేగవంతం కావడానికి కమిషనర్ నిత్యం సమీక్షిస్తున్నారు. గత ఏడాది తిరుపతి ఎంఆర్‌పల్లి వద్ద యుడిఎస్ డ్రైన్‌లో ముగ్గురు పడి మృతిచెందారు. బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలోనూ కమీషనర్ కృషి ఉంది. నిత్యం అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షలు చేస్తూ, కాంట్రాక్టర్లకు క్షేత్రస్థాయిలో దిశానిర్దేశం చేస్తున్నారు. స్వచ్ఛసర్వేక్షన్‌లో తిరుపతికి ప్రెసిడెంట్ అవార్డు వచ్చింది. తిరుపతి ఐకానిక్ భవన నిర్మాణం భూమిపూజ, రైల్వేస్టేషన్ వద్ద మల్టీలెవల్ కారు పార్కింగ్ పనులు ఆమె హయాంలోనే జరుగుతున్నాయి. ఏడాదిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యారు. ప్రస్తుతం ఆమె డిప్యుటేషన్‌పై వెళతారని తెలిసిన నేపథ్యంలో వచ్చే కమిషనర్ ఎవరన్నది చర్చ నడుస్తోంది. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న హరిత వస్తారని సమాచారం. గతంలో ఆమెకు అడిషినల్ కమిషనర్‌గా తిరుపతిలో పనిచేసిన అనుభవం ఉంది. ఆమె సైతం తిరుపతికి రావడానికి సుముఖంగా ఉన్నట్లు సమాచారం.

ఎండల్లో జాగ్రత్తలు తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మార్చి మాసం నుంచి ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉందని, 48-49 డిగ్రీలు జిల్లాలో నమోదయ్యే అవకాశం ఉందని, వడగాలులు తోడు కానున్నాయని అధికారులు, స్వచ్ఛందసంస్థలు, స్వయం సహాయక సంఘాలు సమన్వయంతో అవగాహన కల్పించాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో విపత్తుల నిర్వహణకు సంబంధించి ఈ ఏడాది నమోదు కానున్న ఎండల తీవ్రత, వడగాల్పులపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై జేసీ డికె బాలాజీతో కలిసి అధికారులతో సమీక్షించారు. జిల్లా, మండలస్థాయిలో కంట్రోల్ రూముల ఏర్పాటు, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు మజ్జిగ పంపిణీ, చలివేంద్రాల ఏర్పాటు చూడాలన్నారు. ప్రతిరోజూ నమోదు కానున్న ఎండ తీవ్రత వివరాలు మీడియాకు అందించి ప్రత్యేక కాలమ్ ఏర్పాటుతో ప్రచురించేలా చూడాలన్నారు. గ్రామాల్లో పశువుల కోసం నీటిని అందుబాటులో ఉంచాలన్నారు. పాఠశాలల పిల్లలకు సంబంధించి త్వరలో సమయం నిర్ణయిస్తుందని, ఆ ప్రకారం పిల్లలు ఇళ్లకు వెళ్లేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. వడదెబ్బతో ఏ ఒక్కరికీ ప్రాణహాని కలగరాదనానరు. ఉపాధి హామీ పనులు ఉదయం, సాయంత్రం చేపట్టేలా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో షెల్టర్లు ఏర్పాటు చూడాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో తాత్కాలిక గ్రీన్‌షెడ్స్ ఏర్పాటు చేయాలని, స్ట్రీట్ వెండర్లకు మున్సిపల్ అధికారులు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బయట తిరగరాదన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా అధికారి విజయకుమార్, జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, సెక్షన్ సూపరింటెండెంట్ పరమేశ్వరస్వామి పాల్గొన్నారు.


అధికారులతో కలెక్టర్ సమీక్ష

కూచిపూడి ప్రదర్శన నృత్య అంశాలపై అవగాహన



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ ప్రఖ్యాత కూచిపూడి నృత్య కళాకారిణి, తెలుగు విశ్వవిద్యాలయం నృత్య శాఖ అధిపతి అయిన వనజ ఉదయ్ తో కూచిపూడి ప్రదర్శన నృత్య అంశాల గురించి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు నృత్య రీతులను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారి శిష్యురాలు ప్రణతి, ఐయ, నాగదుర్గ, అరుణ చక్రవర్తి నృత్య రీతులను ప్రదర్శించి విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. వనజ ఉదయ్ సంప్రదాయ కూచి పూడి రీతులను ప్రదర్శిస్తూ వివరంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ప్రొఫెసర్ సైలేశ్వరి, డాక్టర్ హిమబిందు, వివిధ శాఖలకు చెందిన ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడంతో శరీరానికి కావలసిన పోషకాహారాలు పుష్కలంగా అందుతాయని ఐసిడిఎస్ పద్మజ పేర్కొన్నారు. సోమవారం పౌష్టికాహారాల ధాన్యాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోషణ పక్వాడలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు, రీసోర్స్ పర్సన్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కోట: మండలంలోని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టులో భాగంగా బాలికల హాస్టల్‌లో స్థానిక సిడిపిఒ మునుకుమారి ఆధ్వర్యంలో బాలికలకు పోషణ పక్వాడలో భాగంగా సోమవారం చిరుధాన్యాల ప్రాముఖ్యత, బాల్య వివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కవిత, కష్ణమ్మ, శేషమ్మ, బుజ్జమ్మ, పద్మ, బాలికలు పాల్గొన్నారు.

కేబీఆర్ పురం దళితవాడలో నిలిచిన నీరు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రూరల్ మండలం కేబీఆర్ పురం దళితవాడలో వర్షపు నీరు ఇళ్లలోకి వస్తున్నట్లు స్థానిక ప్రజలు వాపోతున్నారు. మండల అధికారులు, గ్రామ సర్పంచి చోద్యం చూస్తున్నారని సోమవారం ప్రజలు మీడియాతో వాపోయారు. సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేప్పుడు సరైన అవగాహన లేని కాంట్రాక్టర్లకు రోడ్డు పనులు అప్పగించడంతో సీసీ రోడ్లు పల్లంగా నిర్మించినందున సాధారణ వర్షం పడ్డా తమ ఇళ్లలోకి చేరుతున్నాయని గ్రామస్తుల ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమన్వయంతో వర్షపు నీరు తమ ఇళ్లలో చేరకుండా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని గ్రామస్తులు వాపోయారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి-కోట: పంచాయతీ కార్యదర్శి విధుల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు తీసుకోవాలని గూడూరు డిఎల్‌పిఒ వెంకటరమణకి బీజేపీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు వ్రాతపూర్వకంగా నివేదికను సోమవారం అందజేశారు. అనంతరం పనబాక కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండడం లేదని, ఆ స్థానంలో మరొక పంచాయతీ కార్యదర్శిని నియమించి పంచాయతీ ప్రజలకు న్యాయం చేయాలని డిఎల్‌పిఒని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని వెంకన్నపాలెం పంచాయతీ సెక్రటరీలో డిఎల్‌పిఒ వెంకటరమణ విలేకరులతో మాట్లాడుతూ శ్రీలక్ష్మి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నదని, సచివాలయ ఉద్యోగులకు జీతాలు రాకుండా ఆలస్యం చేసినందుకు తదితర అభియోగాలపై విచారణ చేస్తున్నామని తెలిపారు. విచారణ అనంతరం నివేదికను పరిశీలించి పై అధికారుల దష్టికి తీసుకెళ్తామన్నారు.

చిరుధాన్యాల సాగుతో రైతులకు లాభాలు



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: చిరుధాన్యాల సాగుతో రైతులు మంచి లాభాలు గడించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.వి శ్రీనివాసులు అన్నారు. జంగవాళ్లపల్లె గ్రామ రైతులకు సోమవారం రైతు భరోసా కేంద్రంలో చిరుధాన్యాల సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఆరోగ్య రీత్యా చిరుధాన్యాల వినియోగంపై ఎక్కువగా ప్రజల్లో చైతన్యం రావడంతో వాటి వినియోగం పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో చిరుధాన్యాల సాగులో అధికలాభాలు గడించవచ్చన్నారు. వరి పంటను క్షేత్రస్థాయిలో సందర్శించి కాండం తొలుచూరి పురుగు, ఎండు తెగులు అధికంగా ఉన్నట్లు సూచించారు. మండల వ్యవసాయాధికారి ధనలక్ష్మి, ఉద్యానశాఖాధికారి శివకుమారి, సిబ్బంది పూర్ణిమ, కిషోర్, సర్పంచ్ విమల మోహన్, ఆర్‌బికె సిబ్బంది ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేం ద్రంలో రబీ సీజన్‌లో వరి, చిరుధాన్య పంటలపై ఆత్మ చిత్తూ రు వారి ఆధ్వర్యంలో రైతులకు సోమవారం అవగాహన కార్య క్రమం నిర్వహిం చారు. రైతులు ప్రస్తుతం రబీ సీజన్‌లో వేసిన వరి పంటలు, ఇతర కూరగాయల చిరుధాన్యాల పంటల చీడపీడల సమస్యల పరిష్కారం గురించి, పంటల అధిక దిగుబడిపై మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా వివరించారు. ప్రస్తుతం మామిడి నాణ్యత, చీడపీడలు, తేనె బంక నివారణకు సలహాలు సూచనలను జిల్లా అధికారులు సుధా, శ్రీనివాసులు రైతులకు అవగాహన కల్పించారు.

ఆర్థిక సంఘం చైర్మన్‌గా రత్నకుమారి

ప్రజాశక్తి-క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్‌గా శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగపు విశ్రాంత ఆచార్యులు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య శెట్టిపల్లి రత్నకుమారిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ నుంచి సోమవారం ఉత్తర్వులు వెలుపడ్డాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీరామనవమి సందర్భంగా శ్రీకోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం 6:00 నుంచి 9:00 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించినట్లు శ్రీ వెంకటేశ్వర సంగీతం కత్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఉమా ముద్దుబల తెలిపారు.

ప్రీఎస్ఎమ్ పథకంపై వర్క్‌షాప్




ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో "హైబ్రిడ్ మోడ్"లో 5 సంవత్సరాలు (2015 -2020) ప్రీఎస్ఎమ్ పథకం ప్రభావం యొక్క అధ్యయన నివేదికపై వ్యాప్తి వర్క్‌షాప్ సోమవారం సావేరి అతిథి సమావేశంలో నిర్వహించారు. డిఎస్ఐఆర్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ రామానుజ్ బెనర్జీ, ప్రీఎస్ఎమ్ లక్ష్యాలను వివరిస్తూ, వర్తమాన విద్యార్థులు, నిపుణులు, రైతులు, గృహిణులు, సామాజిక ఔత్సాహికుల వాణిజ్యపరంగా లాభదాయకమైన ఉత్పత్తి మార్గాలుగా నవల ఆలోచన ఉన్న పౌరులను చేరువేయడమే ప్రీఎస్ఎమ్ లక్ష్యం. ఈ పథకం వ్యక్తిగత ఇన్నోవేటర్‌కు రూ. 2 లక్షల నుండి రూ.50 లక్షల వరకు నిధులను అందిస్తుంది. మహిళా వర్సిటీ బృందం నిర్వహించిన ప్రభావ అధ్యయనం పథకాన్ని మరింత ప్రోత్సహించడానికి ప్రీఎస్ఎమ్ యొక్క లోతైన అంతర్దృష్టిని అందజేస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ఆవిష్కర్తలను చేరుకోవడంలో ప్రీఎస్ఎమ్ కీలక పాత్ర పోషిస్తోందని డిఎస్ఐఆర్ హెడ్ డాక్టర్ పికె దత్తా పేర్కొన్నారు. డిఎస్ఐఆర్ మాజీ సెక్రటరీ, పద్మభూషణ్, ఇంపాక్ట్ స్టడీ యొక్క మెంటార్ డాక్టర్ టి.రామసామి మాట్లాడుతూ ప్రీఎస్ఎమ్ ఆవిష్కర్తల ప్రజాస్వామ్యీకరణను విశ్వసిస్తుందని, అందువల్ల ఆవిష్కరణలను పెంచడానికి ఆవిష్కర్తలు అభివృద్ధి చేసిన చిన్న ఆవిష్కరణలకు విలువను సృష్టించడం చాలా ముఖ్యమని అన్నారు. ప్రీఎస్ఎమ్ నుంచి వెలువడుతున్న అనధికారిక ఆవిష్కరణలు ఈ పథకం యొక్క ప్రత్యేకత అని న్యూ ఢిల్లీలోని డెవలపింగ్ కంట్రీస్ రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ డైరెక్టర్ జనరల్ మరియు ప్రభావ అధ్యయన సలహా కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ సచిన్ చతుర్వేది అన్నారు. జాతీయ, భౌగోళిక మరియు రంగాల ఆవిష్కరణల గురించి ఆయన చర్చించారు. ఆవిష్కరణలు ఆర్థిక వృద్ధికి దోహదపడతాయని ఉద్ఘాటించారు.

ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా ప్రొఫెసర్.పి ఉమా మహేశ్వరి దేవి, కో ఇన్వెస్టిగేటర్లుగా ప్రొఫెసర్ పి.విజయ లక్ష్మి, పి.జ్యోత్స్నతో కూడిన పరిశోధనా బృందం దేశవ్యాప్తంగా ఉన్న టిఒసిఐసిఎస్ ను సందర్శించి డేటాను సేకరించేందుకు కేంద్రాల సమన్వయకర్తలు మరియు ఆవిష్కర్తలతో సంభాషించింది. ప్రొఫెసర్ పి ఉమా మహేశ్వరి దేవి నివేదిక యొక్క ప్రధాన ఫలితాలను సమర్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న 132 మంది ఆవిష్కర్తలకు డిఎస్ఐఆర్ రూ. 827 లక్షలు అందించింది. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రీమిస్ పథకం ప్రభావంపై లోతైన అధ్యయనం చేసినందుకు బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనీ, కమిటీ సభ్యులు డాక్టర్ లలిత గురుప్రసాద్, ప్రొఫెసర్ సునీల్ భంద్, డాక్టర్ ఇంద్రనీల్ బిస్వాస్, ఆవిష్కర్తలు వివేక్ పనాడే, వేణు పొలినేని, ఇతర యూనివర్సిటీలు, కాలేజీల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశానికి ఐకాన్‌గా టిటిడి మానుస్క్రిప్ట్స్ ప్రాజెక్టు : ఈవో

ప్రజాశక్తి - క్యాంపస్: టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న మానుస్క్రిప్ట్స్ ప్రాజెక్టు దేశానికే ఐకాన్‌గా తయారు కావాలని టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి చెప్పారు. ఇక్కడ స్కాన్ చేసి భద్రపరచిన మానుస్క్రిప్ట్స్ పై పిహెచ్‌డిలు చేసే స్థాయికి తీసుకుని రావాలన్నారు. మానుస్క్రిప్ట్స్ ప్రాజెక్టు ప్రగతిపై సోమవారం శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు ప్రగతిపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ పురావస్తు శాఖ నుంచి తెచ్చిన సుమారు 5500 తాళపత్ర గ్రంథాల్లో ఇప్పటివరకు 3370 తాళపత్ర గ్రంథాలు స్కాన్ చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో 2,11,313 తాళపత్రాలు ఉన్నట్లు ఆయన చెప్పారు. రెండు నెలల్లో మిగిలిన గ్రంథాలను స్కాన్ చేయడానికి అవసరమైన సాంకేతిక సహకారం, సిబ్బందిని ఇస్తామని ఈవో వివరించారు. ప్రస్తుతం రోజుకు ఎన్ని తాళపత్రాలు స్కాన్ చేస్తున్నారు, తాళపత్రం శుభ్రపరచడం నుంచి తైల శోధన, స్కానింగ్ వరకు జరిగే వివిధ ప్రక్రియల గురించి ఈవో తెలుసుకున్నారు. వేదాంతం, పురాణాలు, కావ్యాలు, జ్యోతిష్యం తదితర అంశాలకు సంబంధించిన తాళపత్ర గ్రంథాలు ఉన్నాయని అధికారులు ధర్మారెడ్డి కి వివరించారు. ఇవి జాతి సంపద అని, వీటిని జాగ్రత్తగా స్కాన్ చేసి ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా తెలుగులో తర్జుమా చేయాలని ఈవో అధికారులకు సూచించారు. ఇలా తర్జుమా చేసిన వాటిని పుస్తక రూపంలో తేవడానికి ఒక ప్రాజెక్టు తయారు చేసి ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ పుస్తకాల ఆధారంగా పిహెచ్డి చేయడానికి అవసరమైన వాతావరణం కల్పించి పిహెచ్ డిలు ప్రదానం చేసే ఏర్పాటు చేయాలన్నారు. దేశంలో ఇంకా ఎక్కడ మాను స్క్రిప్ట్స్ ఉన్నాయో తెలుసుకుని వాటిని సేకరించి స్కాన్ చేసి భద్రపరచ గలిగితే పరిశోధకులకు మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న గ్రంథాలను అంశాల వారీగా వర్గీకరించి వాటికి ప్రత్యేకంగా నంబర్లు వేసి భద్రపరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సనాతన జీవన్ ట్రస్టు సహకారంతో టిటిడి ఆధ్వర్యంలో వేద విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ప్రాజెక్టుకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తేవాలని ఆయన ఆకాంక్షించారు. జేఈవో సదా భార్గవి, విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య రాణి సదాశివ మూర్తి, మానుస్క్రిప్ట్స్ ప్రాజెక్టు డిప్యూటీ ఈవో విజయలక్ష్మి, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధేశ్యాం పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి




ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు తిరుపతి జిల్లాలోని పలు మండలాల్లో రైతులు వేసిన పంటలు చేతి కొచ్చే దశలో నేలపాలై నష్టపోయారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ సోమవారం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ అకాల వర్షాల వల్ల శ్రీకాళహస్తి మండలం, వెంకటగిరి, ఏర్పేడు, కేవీబీ పురం, బుచ్చినాయుడు కండ్రిగ, నాగలాపురం, పిచ్చాటూరు, వరదయ్యపాలెం, సత్యవేడు, నారాయణవనం, తడ, సూళ్లూరుపేట, కోట, వాకాడు, గూడూరు, తదితర మండలాలలో వరి పంట కోత దశలో నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అలాగే మామిడి తోటలు పూత దశలో ఉన్నందున పూత మొత్తం రాలిపోయి దిగుబడి తగ్గిపోతుందని, రైతులు ఆందోళన ఉన్నారని తెలిపారు. అలాగే ప్రస్తుతం వేరుశనగ విత్తనం వేసిన రైతులు మొలకెత్తకుండా నీటిలో మునిగి పంట నష్టం వాటిల్లిందని మరియు వేరుశనగ పంటను కోసిన రైతులు వాటిని ఎండబెట్టే కల్లాల్లో వర్షపు నీటికి తడిసి మొలకెత్తుతున్నాయన్నారు. రైతులకు తగు నష్టపరిహారం ప్రభుత్వం మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కులుకు చీటీలు, లాటరీ చిట్టీలతో జాగ్రత్త



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రస్తుతం ఉన్నటువంటి ఈ సమాజంలో గ్రామీణ ప్రాంత అమాయక ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా కొంతమంది దూర ప్రాంతాల వ్యక్తులు కులుకు చీటీలు, లాటరీ చీటీలు అని సంచరిస్తూ ఉండే వారితో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సోమవారం అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ చీటీల వల్ల తక్కువ కాలంలో ఎక్కువ ఆదాయం పొందవచ్చునని, గ్రామీణ ప్రాంతాల ప్రజల నుంచి డబ్బులను కట్టించుకుంటారన్నారు. తదుపరి ఈ లాటరీ చీటీని వాళ్ళ ఊరిలోనే కులికి కొంతమందికి లాటరీ కొట్టిందని, వారికి ఎక్కువ మొత్తంలో డబ్బులు వచ్చినట్లు అందరికీ చూపించి, ఇంకా ఎక్కువ మందిని ఈ స్కీం లో చేర్పించండని చెప్తారన్నారు. ఎక్కువమంది చేరిన తర్వాత డబ్బులు వసూలు చేసుకుని పరారీ అయినట్లు చాలా సందర్భాలున్నాయని తెలియజేశారు. రైతు కూలీలు, దినసరి కూలీల కుటుంబాలే టార్గెట్‌గా వీరు మోసాలకి పాల్పడుతూ ఉన్నారని సమాచారం అందిందని ఎస్పీ గారి ఆదేశాలతో అమాయక ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని మోసాలకు దిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అలాంటివారు మీ గ్రామాలలో ఎవరైనా వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

చర్చను పక్కదారి పట్టించడానికే టీడీపీ భౌతిక దాడులు



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: స్కిల్ డెవలప్‌మెంట్‌లో రూ.370 కోట్ల కుంభకోణంపై చర్చను పక్కదారి పట్టించడానికే టీడీపీ భౌతిక దాడులకి దిగిందని మండల వైసీపీ సీనియర్ నాయకులు ఉగ్గుమూడి గురునాథం సోమవారం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజు అసెంబ్లీలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిన స్కిల్ డెవలప్ మెంట్ కుంభకోణం అక్షరాలా రూ.370 కోట్ల గురించి అసెంబ్లీలో సాక్ష్యాలతో చర్చ జరుగుతున్న తరుణంలో, రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తెలిసిపోతాయనే నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్ పై దౌర్జన్యం చెయ్యడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ బ్లాక్ డే గా ప్రకటించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్స్ ప్రసాద్ పాల్, వైఎస్ ఆనంద్, మండల నాయకులు గురవయ్య, రవి, మునిచంద్రం నాయుడు, బాలశేఖర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ హేమంత్, కో కన్వీనర్స్ మునిరాజ, దశయ్య పురుషోత్తం, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేలపై దాడి అమానుషం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: అసెంబ్లీలో సోమవారం తెలుగుదేశం పార్టీ సీనియర్ ఎమ్మెల్యేలు బుచ్చయ్యాచౌదరి, బాలవీరాంజనేయ స్వామి, విజయ్ లపై వైసీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడం అమానుషమని తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ పత్రిక ప్రకటనలో సోమవారం తెలిపారు.

బిఎన్ కండ్రిగ: సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు బాల వీరాంజనేయ స్వామి, గోరంట్ల బుచ్చయ్య చౌదరిలపైన వైసీపీ ఎమ్మెల్యేల దాడిని ఖండిస్తున్నట్లు స్థానిక టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు తెలిపా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు ప్రజా దేవాలయమైన అసెంబ్లీలో వైసీపీ నేతల రౌడీయిజాన్ని ప్రజాస్వామ్యవాదులంతా కూడా ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి వైసీపీ ఎమ్మెల్యేలకు రాబోవు రోజులలో ప్రజలే ఓటుతో గుణపాఠం చెప్తారని టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్ తెలిపారు.

కోట: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలపై వైసీపీ ఎమ్మెల్యేల దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు.



పట్టణంలో సోమవారం ఈ ఘటనను ఖండిస్తూ నల్ల బ్యాడ్జీలతో వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ.. తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల స్థానాలన్నిటిలోనూ టీడీపీ గెలవడంతో వైసీపీ నేతలు ఇలా అసెంబ్లీలో దాడి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు దారా సురేష్, షంషుద్దీన్, నాయకులు తీగల సురేష్ బాబు, మధు యాదవ్, నౌషాద్, నాయబ్, బాబు, మోహన్, వంశీ, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



పుత్తూరు టౌన్: అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే డోలా వీరాంజనేయ స్వామి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరెంట్ల బుచ్చయ్య చౌదరిపై దాడిచేయడం హేయనీయమని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాసన సభను కౌరవ సభగా మార్చేస్తున్నారన్నారు. 75 ఏళ్ల వయసున్న ఎమ్మెల్యేపై అమానుషంగా దాడి చేయడాన్ని ఆయన ఖండిచాడు. వైసీపీ పాలన అంతా గూండాయిజంగానే కొనసాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక ఎమ్మెల్యేపై ఇలా దాడి ఘటన ఎప్పుడూ జరగలేదు. సీఎం జగన్ ప్రోద్బలంతో, ఒక వ్యూహంతోనే దళిత ఎమ్మెల్యే స్వామిపై దాడి చేశారు.

సంచార పశు ఆరోగ్య సేవ ప్రారంభం



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: వైఎస్సార్ పశుఆరోగ్య సేవ వాహనాన్ని సోమవారం ఎంపిపి బాలం యుగంధర్ రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ సామకోటి సహదేవరెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ఎక్కువ భాగం పాల ఉత్పత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వం పాడిరైతులకు మరిన్ని సేవలు అందించేందుకు ఈ సంచార పశుఆరోగ్య సేవ వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువులు తీవ్ర అనారోగ్యం పాలైన, పెద్ద ఆపరేషన్లు తదితరాలకు తిరుపతి ప్రధాన ఆసుపత్రికి తరలించి, వాటికి వైద్యం అందించి కాపాడుకొనేందుకు ఈ వాహనం సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎడి ప్రసాద్, వెటర్నరీ సిబ్బంది సురేష్, శివ, సుబ్బు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాగి జావ పంపిణీ ఏర్పాట్ల పర్యవేక్షణ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మండలంలోని గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం నుండి పంపిణీ చేయాల్సిన రాగి జావా పంపిణీ కార్యక్రమాన్ని ముందస్తుగా సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి వి శేఖర్, పుత్తూరు రఘురామయ్య, మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైసీపీ నాయకులు దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మునుస్వామి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బి భారతి, ఉపాధ్యాయుల బందం పాల్గొన్నారు.

ఉపాధి కూలీపై కొండజెర్రి కాటు



ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలోని అలిమేలు మంగాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీ కస్తూరిపై కొండ జెర్రి కాటు వేసిన సంఘటన సోమవారం ఉదయం జరిగింది. వివరాలు ఇలా.. అలిమేలు మంగాపురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పలువురు కూలీలు పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం అలిమేలు మంగాపురం ఫారెస్టుకు సమీపంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్ పర్యవేక్షణలో కూలీలు ఉపాధి పనులు చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో ఉపాధి పనులు చేస్తున్న మస్తాన్ సతీమణి కస్తూరిపై కొండ జెర్రీ కాటు వేయడంతో ఆమె స్పృహతప్పి కింద పడిపోయింది. దీన్ని గమనించిన తోటి కూలీలు గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డికి సమాచారం అందించారు. స్పందించిన గ్రామ సర్పంచ్ వెంటనే సంఘటనా స్థలం చేరుకుని తన సొంత వాహనంలో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కస్తూరిని సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఉపాధిహామీ ఏపీడి ప్రేమ్ కుమార్, ఏపీవో లోకమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ సుమలత తదితరులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గ్రామ సర్పంచ్ శిరీష శ్రీనివాసులు రెడ్డి సొంత వాహనంలోనే కస్తూరిని తిరుపతికి తరలించినట్లు తోటికూలీలు తెలిపారు.

వ్యాయామ అధ్యాపకుడికి పిహెచ్‌డి

ప్రజాశక్తి-కోట: మండలంలోని స్థానిక ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వ్యాయామ విద్య విభాగపు అధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న వి. మల్లికార్జున రెడ్డికి తమిళనాడు కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ నుండి వ్యాయామ విద్యలో చేసిన పరి శోధనకు 2021 మార్చిలో పిహెచ్‌డి డిగ్రీని అందించింది. ఈ డిగ్రీ ప్రధానోత్సవం కాలేజీ 13వ స్నాతకోత్సవంలో భాగంగా ఈ నెల 19 న చెన్నైలోని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చేతుల మీదుగా కేంద్ర యువజన వ్యవహారాల శాఖ, కేంద్ర క్రీడా శాఖా మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, రాష్ట్ర యువజన వ్యవహారాల శాఖ, రాష్ట్ర క్రీడాభివద్ధి శాఖా మంత్రి ఉదయ్‌నిధి స్టాలిన్ ఆధ్వర్యంలో మల్లికార్జున రెడ్డికి పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేయబడినదని కళాశాల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు.



ఎర్రచందనం దుంగల స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కడప జిల్లా పోరుమామిళ్ల అటవీ పరిధిలో 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి ఒక కారు, మోటారు సైకిళ్లను టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ కె.చక్రవర్తి ఆదేశాల మేరకు ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ రాఘవేంద్ర బందం పోరుమామిళ్ల అటవీ రేంజ్‌లోని టేకూరు పేట మీదుగా కవలకుంట్ల ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారన్నారు. సోమవారం ఉదయం కొమ్మినేని రాస్తా ఎడమ వైపు ఒక కారు, మోటారు సైకిల్ నిలిపి ఉండగా అక్కడకు వెళ్లి పరిశీలిస్తే కారులో దుంగలను లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. దీంతో వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా దుంగలను పడేసి పారిపోయారన్నారు. పారిపోతున్న వారిలో ఐదు మంది స్మగ్లర్లను పట్టుకున్నామన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు పోరుమామిళ్ల టౌన్ కు చెందిన పాలగిరి నాగార్జున (32), పెద్దేటి నాగరాజు (35), గుజ్జుల వెంకటేశ్వర్లు (42), చినమల వెంకటయ్య (62), పులివెందులకు చెందిన నీరెద్దుల ప్రకాష్ (20)లుగా గుర్తించామన్నారు. వీరి నుండి 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసుస్టేషన్ లో నమోదు చేసి సీఐ బాలకష్ణ దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



ప్రజాశక్తి-తడ: మండలంలోని సరిహద్దు ప్రాంతమైన పన్నంగాడు వద్ద బైక్ డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. వెంకటరమణ, అరుణ్‌లు చెన్నైకు వెళుతుండగా డైవర్షన్ కోసం జాతీయ రహదారి పై ఏర్పాటు చేసి ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ చోరీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల కేంద్రంలోని ఏకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకురాలు అన్నపూర్ణమ్మ వంట గదిలోని గ్యాస్ సిలిండర్ చోరీకి గురైనట్లు సో మవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. శనివారం మధ్యాహ్నం విద్యార్థులకు భోజనం సరఫరా చేసిన తర్వాత వంట గదిలో వంట సామాగ్రి భారతి గ్యాస్ సిలిండర్ పెట్టి వంటగదికి తాళాలు వేసుకుని వెళ్లింది. సోమవారం పాఠశాల ప్రారంభం కావడంతో భోజనం వండేందుకు వంట గదికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉంది. దీంతో వంట గదిలోకి వెళ్లి పరిశీలించగా సిలిండర్ మాత్రం లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ దొంగలు ఎవరు..?

గ్రామంలో పలుచోట్ల ఈ గ్యాస్ సిలిండర్ దొంగతనాలు జరుగుతూ ఉన్నాయి వీటిలో కొందరు పోలీస్ స్టేషన్ కి ఫిర్యాదు చేస్తున్నారు మరి కొందరు ఫిర్యాదు చేయడం లేదు. నెల రోజుల క్రితం జాతీయ రహదారి పక్కనే ఉన్న మేరీమాత గుడి సమీపంలోని హోటల్లో గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్ సిలిండరు, టేబుల్ ఫ్యాన్, మిక్సీని తీసుకెళ్లిపోయారు. ఇదే క్రమంలో మసీద్ సమీపంలోని ఒక ఇంట్లో ఎవరూ లేని రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వెళ్లి తలుపు తాళం పగలగొట్టి ఆ ఇంట్లోని చీరలు, నగదు, కొన్ని వస్తువులు తీసుకెళ్లారు. అయితే వీటిపై పోలీస్ స్టేషన్లో ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇకనైనా పోలీసులు గట్టి నిగా వుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.

చట్ట వ్యతిరేక పనులు చేస్తే శిక్షలు తప్పవు



ప్రజాశక్తి-డక్కిలి: మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో ఎవరైనా పాల్గొంటే చర్యలు తప్పవన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఎస్సై నాగరాజు విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఉగాది, నడిం పల్లి జాతర సంబరాల్లో ఎటువంటి చట్ట వ్యతిరేక డ్యాన్సు లు, జూదాలు తదితర నిషేధితమైన కార్యకలాపాల్లో పాల్గొంటే జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో ఎన్‌హెచ్ 565 రోడ్డు ఆనుకొని ఉన్న ప్రజలు రాత్రి వేళల్లో గేదెల ను రోడ్లపైకి వదిలితే వాటిని జిల్లాలోని గోశాలకు తరలిస్తామని హెచ్చ రించారు. మండలంలోని ప్రధాన రహదారిలో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయుటకు చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నియామకం

ప్రజాశక్తి-సత్యవేడు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ ఆదేశాను సారం సోమవారం సత్యవేడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నిరూపకు మస్తాన్ మాదిగను నియమిం చడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉమ్మడి చిత్తూరు జిల్లా కో ఆర్డినేటర్ యస్ నరేంద్ర బాబు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకర ణకు ద్రోహం చేసిన పార్టీలకు అతీతంగా కాకుండా ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు నిరంతరం పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కో కన్వీనర్ రాగిపట్టు రాఘవయ్య మాదిగ, సత్యవేడు నియోజకవర్గ కో కన్వీనర్ ఎర్రమల్లి గౌరీ భాస్కర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.